

# మళ్లీ వంటింట్లోకి టమాట..
## దిగివస్తున్న టమాట ధరలు

హైదరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త : ఎన్నాళ్లకు ఎన్నాళ్లు..టమాట వంటింట్లోకి వచ్చింది. క్రమంగా టమాట ధరలు తగ్గుముఖం పడుతుండడంతో నగరంలో కొనుగోలుదారులు తిరిగి టమాట కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవల వరకు టమాట అత్యంత ఖరీదుగా మారింది.ఏకంగా డబుల్ సెంచరీ వరకు వెళ్లింది.వీటి ధర బుధవారం అత్యధికంగా కిలో టమాట రూ.100లు వరకు ఉండగా,క్రమంగా తగ్గుముఖం పడుతూ గురువారం కిలో రూ.60లు చొప్పున అమ్ముతున్నారు. కొందరు రూ.120కి 3కేజీ చొప్పున కూడా అమ్మకాలు కొనసాగించారు.నగర మార్కెట్లో ఏ గ్రేడ్ కిలో టమాటా ధర రూ.50లు నుంచి రూ.65 వరకు నమోదుకాగా. బీ గ్రేడ్ రూ.35 నుంచి రూ.45 వరకు ధరలు నమోదయ్యాయి. దిగుబడి స్వల్పంగా పెరగడంతో ధరలు తగ్గాయి.



హైదరాబాద్ వార్త

# మళ్లీ చెడ్డిగ్యాంగు కలకలం

**శివారుప్రాంత కాలనీలే టార్గెట్‌గా దోపిడీ**

**విల్లాలు, ఇండిపెండెంట్ ఇండ్లపైనే ఫోకస్**

**తాజాగా మియాపూర్‌లోని ఓవిల్లాలో దోపిడీ**

**అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు**



హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త: భయానక చెడ్డిగ్యాంగ్ ఛాయలు మళ్లీ నగరంలో కనిపిస్తున్నాయి. ఇటీవల నగరంలోని మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సిసిటీవి పుటేజీలను పరిశీలించారు. దీంతో భయానక దృశ్యాలు వెలుగు చూశాయి. రాత్రి వేళల్లో చెడ్డీ గ్యాంగ్ అగంతకులు కత్తులు పట్టుకుని వీధుల్లో సంచరిస్తున్నారు. నేర్పుగా మాటువేసి.. ప్రజలందరూ గాడ నిద్రలోకి వెళ్ళిన తర్వాత తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో మియాపూర్‌లో చెడ్డీ గ్యాంగ్ కదలికలు ఆప్రాంత ఎస్సై నిర్ధారణ చేశారు. అక్కడి వసంత విల్లాలో చొరబడ్డ దొంగలు 30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు.దీంతో సిసికెమెరాల్లో చెడ్డీ గ్యాంగ్ తచ్చాడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. పోలీసుల ఈసిసిటీవి పుటేజీ సర్క్యులేట్ చేస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రజలంతా అలర్ట్‌గా ఉండాలని ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. రాత్రివేళల్లో ఏదైనా అలికిడిగా అనిపించినా, ఎవరైనా డోర్ కొట్టినా..వెంటనే తెరవదనదని సూచిస్తున్నారు.

**ఉదయం సంచార వ్యాపారాలు, రాత్రి దొంగతనాలు**

ఈచెడ్డి గ్యాంగ్‌లు ఎక్కువగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లాంటి ప్రాంతాల నుంచి దక్షిణాదికి వస్తున్నారు. పగటిపూట కాలనీల్లో బొమ్మలు ,చీరలు ఆమ్మే సంచార కుటుంబాల్లాగా కనిపిస్తారు. వీటిని అమ్ముకుంటునే తమకు అనువుగా ఉన్న ప్రాంతాలను,ఇళ్లను సెలక్ట్ చేసుకుని.. రాత్రి పూట ఎటాక్ చేస్తారు. రాత్రి సమయంలో అర్ధరాత్రి తర్వాత మారణాయుధాలతో రాత్రిళ్లు సంచరిస్తూ ఒంటిపై చొక్కా లేకుండా, కేవలం చెడ్డీలు మాత్రమే ధరిస్తారు. ఎవరైనా పట్టుకున్నా తప్పించుకునేందుకు వీలుగా ఒళ్లంతా ఆయిల్ పూసుకంటారు. ఎవరైనా ఎదరిస్తే..వారిపై దాడి చేసి చంపేందుకు సైతం వెనకాడరు. అయితే వారికి గుర్తించేందుకు ఒకట్రిక్ ఉందని పోలీసులు చెబుతున్నారు. స్థానికుల్లా కలరింగ్ ఇచ్చేందుకు.. మనభాషలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తారట..వారుమాట్లాడే విధానంలో తేడా ఉంటుంది కాబట్టి ఈజీగా గుర్తించవచ్చు అని పోలీసుల చెబుతన్నారు.

**ఊరెళ్లే పోలీసులకు సమాచారం ఇవ్వడం మేలు..**

శివారు కాలనీల్లో ప్రజలు గార్డును పెట్టుకోవడం లేదా..ఇంటి చుట్టూ ఎలక్ట్రిక్ లేదా సోలార్ ఫెన్సింగ్ వేసుకోవడం ద్వారా వీరిని నిలువరించవచ్చు. ఎందుకంటే అనువుగా లేని ఇళ్లజోలికి వీళ్లు పెద్దగా వెళ్లరు. శివారు ప్రాంతాల్లో ఉంటున్న వారు ఇళ్ల చుట్టూ సిసిటివి కెమెరాలు పెట్టుకో వడంఏదైనా ఊర్లు, తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ముందే పోలీసులకు సమాచారంఇస్తే... ఆఇళ్లపై నిఘా పెడతామని పోలీసులు చెబుతున్నారు.

# మెట్రో ప్రయాణికులకు అదిరిపోయే ఆఫర్

**వారాంతాన్ని ఆస్వాదించేలా రూ.59కు**

**అపరిమిత మెట్రో ప్రయాణాలు**



హైదరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త : మెట్రో ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్ వచ్చింది. ఇటీవల కాలం నుంచి మెట్రో ప్రయాణికుల కోసం సరికొత్త ఆఫర్లతో ముందుకు వస్తోంది. నగరంలో ట్రాఫిక్ దృష్ట్యా చాలా మంది మెట్రో రైలును ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రయాణం సులభతరం అవుతుండటంతో ప్రయాణికులను మరింతగా ఆకట్టుకునేందుకు హైదరాబాద్ మెట్రో సరికొత్త ప్లాన్ ప్రకటించింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెట్రో రైల్ ప్రయాణికులకు 'సూపర్ సేవర్ ఫ్రీడమ్ ఆఫర్' ప్రయాణికుల కోసం ప్రత్యేక ఆఫర్ కల్పిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారాంతంలో ప్రయాణికుల అనుభూతిని మరింతగా పెంచేందుకు ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఆఫర్‌లో భాగంగా కేవలం రూ.59తో తమ సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డును రీచార్జ్ చేయడం ద్వారా ఆగస్టు 12, 13, 15వ తేదీల్లో ఆపరిమిత మెట్రో రైడ్‌లను ఆస్వాధించవచ్చని మెట్రో రైల్ సుదీర్ఘ స్వాతంత్ర్య దినోత్సవ వారాంతంలో మెట్రో ప్రయాణాన్ని ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడానికి ఈ ప్రత్యేక ప్రమోషన్ ప్రయత్నిస్తుంది. ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, పర్యావరణ అనుకూల ప్రయాణాన్ని ప్రోత్సహించడం, హరిత వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా నగరం మొత్తం అభివృద్ధికి ప్రోత్సహించడంలో కీలకపాత్రను ఇది పోషిస్తుంది.

ఈ ఆఫర్‌లో భాగంగా కేవలం రూ.59లతో సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డును రీచార్జ్ చేసుకోవాలి. రూ.59ల రీఛార్జ్‌తో వీకెండ్‌ను ఆస్వాదించడానికి అనువుగా ఉండడంతో పాటు ఆపరిమిత మెట్రో రైడ్లు చేసే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఎల్అండ్‌టి మెట్రో రైల్ హైదరాబాద్ ఎండి, సీఈవో కెవిబి రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

## రాజీవ్ రహదారి, మేడ్చల్ హైవే మార్గాల్లో
# ఫ్లైఓవర్,స్కైవేల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో బ్రిగేడియర్ సోమశంకర్, సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్,ఆగస్టు 11 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జింఖానా జెబిఎస్ మీదుగా రాజీవ్ రహదారి, బోయిన్‌పల్లి, మేడ్చల్ హైవే మార్గాల్లో రెండు ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖకు సంబంధించిన 157 ఎకరాల రక్షణ శాఖ స్థలాలను రా ష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు కంటోన్మెంట్ బోర్డు తీర్మాణం చేసింది. శుక్రవారం రక్షణ శాఖ స్థలాలను ప్రధాన రహదారుల నిర్మా ణాలకు ఆర్మీ అంఫీకారం తెలుపడంతో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణలు తీరా ్మణం చేసి రక్షణ శాఖకు నివేదికను పంపారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మీదుగా మేడ్చల్ హైవే, జింఖానా,జెబిఎస్, హాకీంపేట్ మీదుగా శామీర్‌పేట్‌కు వెళ్లే రాజీవ్ రహదారి మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డు వెడల్పుల అంశంపై గతంలో రక్షణ శాఖ అభ్యంతరం తెలుపడంతో జాప్యం జరిగింది. ముఖ్య మంత్రి కేసిఆర్, ఐటీ మంత్రి కేటిఆర్‌లు అనేక సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయడంతో హెచ్‌ఎండీఏ, రక్షణ శాఖలు సర్వేలు నిర్వహించి 60 మీటర్ల వెడల్పుతో స్కైవే, హైవే,ఫ్లై ఓవర్లకు అనుమతి ఇచ్చింది.

# ఏడేళ్ల బాలికపై తండ్రికొడుకుల అఘాయిత్యం



నిందితులు శివకుమార్, శ్యామేల్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త : అభం.. శుభం తెలియని ఏడేళ్ళ చిన్నారిపై తండ్రి, కొడుకులు కలిసి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిఐ ప్రశాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నిరుపేద దంపతులు గత కొన్నేళ్ళ కిందట నగరానికి వలస వచ్చి కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రాబస్తీలో అద్దెకు ఉంటూ కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజుమాదిరిగానే గురువారం దంపతులు కూలీపనుల కోసం బయటకు వెళ్ళగా వారి ఏడేళ్ళ కూతురు ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈక్రమంలో వారి ఇంటి పక్కన ఉన్న మరో ఇంట్లోకి కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివకుమార్(49), తన కొడుకు శ్యామేల్(19) గత నెల కిందట తన కుటుంబ సభ్యులతో కలిసి అద్దె తీసుకొని కొరియర్‌బాయ్‌లుగా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటున్న బాలికకు ఫోన్ ఆశచూపి ఇంట్లోకి తీసుకెళ్ళి అఘాయిత్యానికి పాల్పడ్డారు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు అత్యవసర చికిత్స కోసం వైద్యశాలకు తరలించి నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేశారు. కాగా బాలికపై మానవమృగంలా వ్యవహారించి దారుణా నికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితురాలి బంధువులు శుక్రవారం పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు.

## పదవరోజుకు చేరిన మత్స్యశాఖ
# కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన దీక్షలు



ఫొటోరైటప్: మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

ధర్నాచౌక్, ఆగస్టు 11, ప్రభాతవార్త: మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మత్స్యకార కార్మికసంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ లో ఫిషరీస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమంకు ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మత్స్యరైతు లను తయారు చేయటంలో కీలక పాత్ర పోషించిన మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు గత పదిరోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నప్పటికీ, ప్రభుత్వం స్పందించక పోవటం విచారకరమని అన్నారు. ఇటీవల కాలంలో చేపలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని, చేపలు తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలని అనేక మంది వైద్యులు సైతం చెబుతు న్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి. రమేష్, ఉపాధ్యక్షులు కిరణ్, కార్యదర్శి ఏసుదాసు మరియు వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వృద్ధులు, తల్లిదండ్రుల పోషణపై ప్రతి శుక్రవారం విచారణ

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త: వృద్ధులు, తల్లిదండ్రుల పోషణకు సంబంధించిన కేసులు ప్రతి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సాయంత్రం 3.30 నుంచి 5.30వరకు విచారించడం జరుగుతుం దని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు, తల్లిదండ్రులు పోషణ, సంక్షేమచట్టం 2007 ప్రకారం వృద్ధులను, తల్లిదండ్రులను ఎవరైనా హింసిస్తే వారిని ఈచట్టం ద్వారా శిక్షించడం జరుగుతుందని అన్నారు. ఇటువం టి వారికి 3నెలల జైలు శిక్ష లేదా 5వేల రూపాయాల జరిమానా విధించబడతాయని తెలిపారు. వారిని హిం సించినా, వారిపోషణ చూడకపోయినా వారికి తల్లిదం డ్రులు ఇచ్చిన స్థిరాస్తుల డీడ్‌లు రద్దు చేయబడతా యని అలాగే వారిని ఇంటినెంచి గెంటివేయడం జరుగుతుం దని తెలిపారు. జిల్లాలో ఇలాంటి వారు ఎవరైనా ఉంటే వెంటనే అప్పీలు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం మొత్తం 10కేసులు విచారించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ అమ్మకు మూడవ వారం సాక సమర్పించిన భక్తులు

బేగంపేట ఆగస్టు 11,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో శుక్రవారం 3వ వారం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మ వారికి సాక సమర్పించారు.అమ్మ వారి కోరిక మేరకు ఐదు వారాలు సాక సమర్పించాలంటూ కోరారు.దీంతో ఇప్పటికి మూడు వారాల నుంచి అమ్మ వారికి సాక సమర్పిస్తున్నారు.



కొవొత్తులతో నివాళులు అర్పించిన దృశ్యం

## బడుగు, బలహీన వర్గాల గొంతుక గద్దర్

హైదరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త: తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో ప్రజాయుద్ధనౌక, ప్రజాగాయకుడు, బడుగు, బలహీనవర్గాల గొంతు స్వర్గీయ గద్దర్‌కు అంబర్‌పేట నియోజకవర్గంలోని సత్యానగర్ బస్తీ ఆవరణలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షుడు కెపి.మురళీకృష్ణ మాట్లాడుతూ బలహీనవర్గాలను తన చివారి శ్వాస వరకు పాట ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. ప్రతి బహుజన బిడ్డ వారి అడుగుజాడల్లో పయనించి పేద వర్గాలకు బహుజనులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సత్యానగర్ బస్తీ అధ్యక్షుడు బి.రామ్‌చందర్, తెలంగాణ జాగృతి వర్కింగ్‌ప్రెసిడెంట్ బి.లింగంగౌడ్, ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్‌రావు, ఉపాధ్యక్షుడు అచ్చిని రమేశ్, కార్యదర్శి పాతకోటటి మహేష్, వెంకటేశ్‌గౌడ్, కుర్మ బిక్షపతి, జగదీశ్, ప్రశాంత్‌కుమార్, టి.లాలాగౌడ్, టింగుల్, రామ్ లక్ష్మణ్, ఈశ్వర్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాతకక్షలతో రౌడీషీటర్ హత్య

చాంద్రాయణగుట్ట, ఆగష్టు 11 ప్రభాతవార్త : పాతకక్ష్యలతో రౌడీషీటర్‌ను విచక్షణా రహితంగా కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బార్కస్ ప్రాంతానికి చెందిన షేక్ సయీద్ బావజీర్(32) జల్‌పల్లి మున్సిపాలిటీలో సామాజిక కార్యకర్త, స్థానిక ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతూ ఉన్నాడు. ఈ నేపధ్యంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తనను చంపేందు ప్రయత్నిస్తున్నారంటూ గత మూడు నెలల క్రితం హోం మంత్రికి ఫిర్యాదు చేశాడు. కాగా బావజీర్ బండ్లగూడ పోలీసులకు సైతం తనకు ప్రాణహాని ఉందని చెప్పి పోలీస్‌స్టేషన్ పరిధిలోనే రాయల్‌సీ హోటల్ సమీపంలో ఓ భవనంలో మొదటి అంతస్తు షెట్టర్‌ను అద్దెకు తీసుకొని ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతడు ఉన్న భవనంలోకి దూరి విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బండ్లగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బావాజీర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్య కేసులో ఆరుగురు నిందితులు ఉన్నారని వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



పేట్‌బషీరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త: విద్యుత్‌ఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మన్నగారి నరేష్(39), స్వప్న దంపతులు సుచిత్రలోని రాజునగర్‌కాలనీ ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 9గంలకు స్వప్న తమ ఇద్దరి పిల్లల్ని స్కూల్లో దింపి ఇంటికి చేరుకోగానే పక్కింటివారు మీభర్త రెయిలింగ్ మీద పడి ఉన్నాడని తెలిపారు. దీంతో హుటాహుటినా రెయిలింగ్ వద్దకు చేరుకొని తన భర్తను లేపే ప్రయత్నం చేయగా విద్యుత్‌షాక్ తగిలింది. ఆమె కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి చేరుకొని నరేష్‌ను బయటకు తీశారు. అప్పటికే నరేష్ మృతిచెందాడు. మృతుడి బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. ఫ్లాట్‌నంబర్-24లో నివాసం ఉంటున్న వారు ఔటర్‌డోర్ ఏసి నుండి ఒక ఇనుప వైర్‌ను మా ఇంటి రెయిలింగ్‌కు కట్టారని, సదరు వైర్ నుండి విద్యుత్ సరఫరా అవడంతోనే నాభర్త చనిపోయాడని విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి భార్య పేర్కొంది.

# హైదరాబాద్ అభివృద్ధిపై కొరియన్ విద్యార్థుల హర్షం

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**



కొరియన్ విద్యార్థులు రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, ఆగస్టు 11 ప్రభాతవార్త : హైదరాబాద్ అభివృద్ధిని తెలుసుకున్న కొరియన్ విద్యార్థుల హర్షం వ్యక్తం చేసినట్లు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. సౌత్ కొరియన్ దేశానికి చెందిన వి లవ్ యూ ఫౌండేషన్, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ వాలంటీర్ గ్రూప్ విద్యార్థులు శుక్రవారం తార్నాకలోని నగర డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిని కలిశారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారికి ప్రభుత్వం చేపడుతున్న వివిద అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ఆద్వర్యంలో నగరాభివృద్ధి అంతర్జాతీయ దేశాలకు ధీటుగా రాష్ట్ర ప్రగతి కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అన్ని సదుపాయాలను కల్పిస్తుందని కొరియన్ విద్యార్థులకు వివరించినట్లు చెప్పారు.

# ఎర్రచందనం చెట్లకు సెన్సార్ రక్షణ

**బొటానికల్ గార్డెన్‌లో ప్రయోగాత్మకంగా 50చెట్లకు చిప్‌సెట్ అమర్చి పర్యవేక్షణ**



చెట్లకు అమర్చనున్న సెన్సార్ చిప్‌సెట్‌ను పరిశీలిస్తున్న టిఎస్‌ఎఫ్‌డిసి ఎండి చంద్రశేఖర్‌రెడ్డి, బొటానికల్ గార్డెన్‌లో ఉన్న చెట్లకు సెన్సార్‌ను అమర్చుతున్న సిబ్బంది

గచ్చిబౌలి, ఆగస్టు 11 ప్రభాతవార్త : ఖరీదైన వృక్షాలను కాపాడుకునేందుకు అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని వాడుకుంటున్నారు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టిఎస్‌ఎఫ్‌డిసి) అధికారులు. నగరంలో ఖరీదైన చెట్లు చోరీకి గురైన ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని బొటానికల్ గార్డెన్‌లోని ఎర్రచందనం చెట్ల రక్షణ కోసం అధునాతన సెన్సార్ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా బొటానికల్ గార్డెన్‌లోని 50 ఎర్రచందనం చెట్లకు ఈ చిప్‌సెట్‌ను అమర్చి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం కొత్తగూడ బొటానికల్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ చిప్‌సెట్ రక్షణకు సంబంధించిన వివరాలను టిఎస్‌ఎఫ్‌డిసి వైస్ చైర్మన్, ఎండి జి.చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన చెట్లు చోరీకి గురైన విషయం ఈ మద్య కాలంలో చూస్తున్నామని, దీన్ని నివారించేందుకు బొటానికల్ గార్డెన్‌లో ఉన్న ఖరీదైన ఎర్రచందనం చెట్ల రక్షణ కోసం రాష్ట్రంలోనే మొదటి సారిగా చిప్‌సెట్‌లను చెట్లను ఏర్పాటు చేశామన్నారు. గార్డెన్‌లో మొత్తం 10వేల వరకు ఎర్రచందనం మొక్కలు ఉన్నాయని, మొదటి విడతగా గార్డెన్‌లో ఉన్న 50 చెట్లకు ఈ చిప్‌సెట్‌ను ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం బెంగళూరుకు చెందిన సిబిఐటీ టెక్నాలజీస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని అన్నారు. ఈ విధానం ద్వారా చెట్లకు దొంగిలించకుండా రక్షించుకోవడంతో పాటు చెట్ల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకునే అవకాశం ఉందన్నారు. సిబిఐటీ సిఈఓ సత్యనారాయణ చొప్పదండి మాట్లాడుతూ ఖరీదైన చెట్ల రక్షణ కోసం తమ సంస్థ ఇండియన్ హుడ్‌సైన్స్ ఆండ్ టెక్నాలజీ(ఐడబ్ల్యుఎస్‌టి) సహకారంతో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ టెక్నాలజీని ఇప్పటికే ఐడబ్ల్యుఎస్‌టి, ఢిల్లీ ఐకార్, బెంగళూరు, ఝాన్సీ నగరాల్లో వాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటి సారిగా బొటానికల్ గార్డెన్‌లో ఎర్రచందనం చెట్లకు సెన్సార్ రక్షణను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌ఎఫ్‌డిసి ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, డైరెక్టర్ ఎంజె. అక్బర్, ఎకో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ సుమన్, ఉపాధ్య క్షుడు రాజశేఖర్, సిబిఐటీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మీ మందిరంలో ప్రత్యేక పూజలు



చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో చార్మినార్ పూజలు నిర్వహిస్తున్న ఎసిపి రుద్ర భాస్కర్

చార్మినార్,ఆగస్టు 11 ప్రభాతవార్త : అధిక మాసం సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో వందలాది మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ కుటుంబ సమేతంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు.ఆయన శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకుని అమ్మ వారి ఆశీస్సులు పొందారు.మందిరం ట్రస్టీ సూర్యప్రకాష్ చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్‌ను సన్మానించారు. కాగా శుక్రవారం కావటంతో జంటనగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి అభిషేకాలు,పూజలు జరిపారు.ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## బస్తీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఓ



మణికొండలోని బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న రంగారెడ్డి జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన

నార్సింగి, ఆగస్టు 11 ప్రభాతవార్త : మణికొండలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న బస్తీ దవాఖానాలో పౌరులకు సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు రంగారెడ్డి జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో బిపి,షుగర్ వ్యాధులకు సంబంధించిన మందులున్నాయా? సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచారా? లేదా? అని పరిశీలించారు. మీ ప్రాంతంలో ఉన్న రోగులకు సకాలంలో బిపి,షుగర్ మందులు అందేలా చూడాలని, బస్తీ దవాఖానాలకు రాలేని వృద్ధులుంటే ఇళ్లకు వెళ్లి మందులు అందజే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మ, డాక్టర్ ఇక్బాల్ ఫారుఖ్, బలరాం, అన్నపూర్ణ, శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



శుక్రవారం సాక సమర్పించేందుకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ ఆలయానికి తరలి వచ్చిన భక్తులు

## కెసిఆర్ పాలనలోనే అన్ని వర్గాల వారికి న్యాయం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



భూనిర్వాసిత రైతులకు పట్టాల పంపిణీ సభలో ప్రసంగిస్తున్న మంత్రి సబిత

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్‌గూడకు చెందిన భూములు కోల్పోయిన పలువురు రైతులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ బొద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్ తదితరులతో కలిసి భూనిర్వాసిత రైతులకు పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుర్మల్‌గూడ రెవెన్యూ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం సేకరించిన భూములవల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్‌డిఓ సూరజ్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ కె.మాధవీరెడ్డి, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, నాయకులు పొన్న జంగయ్య, చిర్ర బాలమణి బాబూరావు, టేకుల చిన్న మల్లారెడ్డి, చిర్ర శ్రీధర్‌కుమార్, కందికంటి అశోక్‌గౌడ్, టేకుల భాస్కర్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్‌లతో పాటు పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీల్లో తన ఫోటో పెట్టకుండా ప్రోటోకాల్ పాటించలేదని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

## తాగు నీటి సమస్యలు తీర్చాలని వాటర్ వర్క్స్ జిఎంకు కార్పొరేటర్ వినతి

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని న్యూ బాలాజీనగర్, సీతాహోమ్స్‌లలో మంచి నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు ఆమె డివిజన్ నాయకుడు జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు నర్సింగ్‌రావు, మదనాచారి తదితరులతో కలిసి వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో నీటి సరఫరా సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన జలమండలి జిఎం సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : శ్రీవాణి

**రామంతాపూర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్, వివేక్‌నగర్, కమ్యూనిటిహాల్ చేపట్టాలని, శ్రీనగర్‌కాలనీ కమ్యూనిటిహాల్ మొదటి అంతస్థు నిర్మించాలని కోరారు. డివిజన్‌లో ఐమాస్ట్ లైట్లు, పోల్స్ ఏర్పాటు చేయాలని, ఇందిరానగర్‌లో సిసి రోడ్డు పనులను విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ పంకజ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ప్రతిఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి


జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావ్ తదితరులు

**రామంతాపూర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** అజాదిక అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు రామంతాపూర్‌లో జాతీయ జెండాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతిఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాలను అవిష్కరించాలని, పోస్టాపీసులతో రూ.25లకే ఒక జెండా ఇస్తున్నారని తెలిపారు. ప్రజలు విధిగా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** వృద్ధులు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోల్, స్నేహపూరికాలనీ సీనియర్ సిటిజన్స్ భవన్‌లో శుక్రవారం మొబైల్ మెడికేర్ యూనిట్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కొత్తపేట డివిజన్ ప్రజలు కోరితే ఆరోగ్యం, సంక్షేమం వృద్ధులకు ప్రతి కాలనీలలో వైద్య పరీక్షలను నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, జ్ఞానకుమార్, మధుసూదన్‌రెడ్డి, బలరామ్, ఆశలత, సంజీవ్‌రాణి, యశ్వంత్‌రావు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలి


వర్షాకాల జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణికుమార్

**తుర్కయాంజాల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేస్తున్న హైపర్ టెన్షన్, దయాబెటిక్ కాంబినేషన్ డ్రగ్స్ వాడుతున్న వారి ఇళ్ల వద్దకు డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ధరణికుమార్ సందర్శించి మాట్లాడుతూ మందులు వాడుతున్న విధానం, వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారు వాడుతున్న మందులపై సూచనలు అందించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తూ ప్రతి శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని, ఇళ్లలో వాడుకునే పాత్రలు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని అన్నారు. నీటినిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తీసివేయాలన్నారు. లేదంటే దోమలు వ్యాపించి మలేరియా, టైఫాయిడ్, విష జ్వరం, డెంగ్యూ, లాంటివి వచ్చే ప్రమాదాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సిహెచ్ఓయం హేమ్‌లాల్, ఎస్‌యుఓ చంద్రశేఖర్, నరసింహ, సూపర్‌వైజర్లు సరిత, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎమ్మెల్యే బేతి పాదయాత్ర


రాంరెడ్డినగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్, కామాక్షిపురం, వాసవినగర్, రాంరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ బేతి స్వప్న తదితరులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కామాక్షిపురం, వాసవినగర్, రాంరెడ్డినగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధునీకరించాలని స్థానికులు విన్నవించినట్లు తెలిపారు. రోడ్లపై వేసిన చెత్తాచెదారం తొలగించాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. వెంకట్‌రెడ్డినగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాంరెడ్డినగర్ బస్తీ దవాఖానాను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రాంరెడ్డినగర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మినారాయణ, కంచి మనోహర్, అరటికాయల భాస్కర్, పిట్టల నరేష్, రవీందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, కార్యదర్శి సోమిరెడ్డి, మహేందర్‌రెడ్డి, గిరిబాబు, ముత్యంరెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, ఎం.డి.ముస్తాక్, శివ, లింగానాయక్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో రిలే నిరాహార దీక్షలు భగ్నం

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు భారంగా మారిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 2 రోజుల పాటు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను మొదటి రోజే మీర్‌పేట్ పోలీసులు భగ్నం చేశారు. పాలకులు ఇచ్చిన హామీ మేరకు పన్నులు తగ్గించకపోవడాన్ని నిరసిస్తూ ఆయన శుక్ర, శనివారాల్లో కార్పొరేషన్ సమీపంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టాలని నిర్ణయించి పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేయించారు. అయితే పోలీసులు మాత్రం అనుమతి ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ప్రకటించిన ప్రకారం చల్లా నర్సింహారెడ్డి కార్పొరేషన్ పార్టీ ఫ్లోర్ లీడర్ చల్లా కవితా బాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల మౌనిక శ్రీశైలం, పార్టీ అనుబంధ శ్రేణులతో కలిసి శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉన్న పోలీసు బలగాలు చల్లాతో పాటు ధర్నా చేస్తున్న వారిలో పలువురిని అరెస్టు చేసి ఘటే క్సర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే చల్లా మాట్లాడుతూ తమ అరెస్టుల ద్వారా పోరాటాలను ఆపలేరనీ పన్నులు తగ్గించే వరకు ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బంగారు బాబు, కీసర యాదిరెడ్డి, పందుల వెంకటేష్‌గౌడ్, ఎరుకల వెంకటేష్‌గౌడ్, నిమ్మల వెంకటేష్‌గౌడ్, దాసరి యాదయ్య, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, గంగమ్మ, అరుణ, పద్మశ్రీ యాదవ్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, అహ్మద్‌బామ్ తదితరులు పాల్గొన్నారు.

## పి అండ్ టి కాలనీలో మంచినీటి పైప్‌లైన్లు


మంచినీటి పైప్‌లైన్‌లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పిఅండ్‌టి కాలనీలో నూతనంగా చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పిఅండ్‌టి కాలనీలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న మంచినీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జలమండలి అధికారులతో చర్చించి కొత్త పనులు మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. డివిజన్ అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అసిఫ్‌అలీ, బిజెపి సీనియర్ నాయకులు బి.కైలాసపతిగౌడ్, సంజయ్‌పటేల్, ఒబిసి అధ్యక్షుడు అల్కాపురి సురేష్, కట్టా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐశ్వర్య లక్ష్మీ హోమం, కుంకుమార్చన

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** మీర్‌పేట్ శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరి నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బీజాక్షరీ సహిత ఐశ్వర్య లక్ష్మీ హోమం ఘనంగా జరిగింది. అధిక శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా వేద పండితులు శ్రీకాంత్ శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు హోమంతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యరకమంలో తీగల సుభాష్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, ఎంవి కృష్ణారావు, వెంకటరమణ, రామచంద్రశర్మ, రామకృష్ణ, చంద్రకాంత్, టిటిడి ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్య జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై శ్రద్ధ వహించండి : ఆకుల


కాలనీలో పర్యటిస్తున్న శ్రీవాణి అంజన్‌కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** డివిజన్ ప్రజల సమస్యలపై అధికారులు శ్రద్ధవహించి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో శుక్రవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించి స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంచినీటి సరఫరా ఫిర్యాదులను పరిష్కరించడానికి సంబంధించి పర్యటించడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలని తెలిపారు.

## నేడు ధర్నా చౌక్ వద్ద బిజెపి మహా ధర్నా

**మలక్‌పేట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** తెలంగాణ బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటలవరకు నిర్వహించనున్నామని భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## 118 జీఓతో కాలనీవాసులు కష్టాలు : బీజేపీ

**మన్సూరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** మంత్రి కెటిఆర్, స్థానిక ఎమ్మెల్యే ఎంతో సాధించామని గొప్పగా చెప్పుకుంటూ ఎన్నికల లబ్ది కోసమే తీసుకొచ్చిన 118 జీఓతో స్థానిక వాసులు కొత్త సమస్యలతో సతమతమవుతున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బిఎన్‌రెడ్డినగర్ భూ సమస్యల పరిష్కారం 118 జీఓతో సాధ్యమైందని గొప్పలు చెప్పిన మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు జీఓపై ఏమి సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఈ జీఓ ప్రకారం కాలనీవాసులు ప్రభుత్వానికి గజానికి రూ. 250చెల్లిస్తున్నారు కానీ అది హుడా లేఅవుట్ అయినప్పటికీ ప్రభుత్వ భూమి అని రికార్డ్‌ల్లోరావడంలో అర్థమేమిటని ఇందుకు అధికారులు, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. లోప భూయిష్టమైన జీఓతో ప్రజలతో చెలగాటమాడుతున్నారని, దీంతో కాలనీవాసులకు బ్యాంకు లోన్లు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పాత పద్దతి ప్రకారం 22ఏ నీ సవరించి ప్రజల వద్ద ఎలాంటి రుసుములు తీసుకోకుండా న్యాయం చేయాలని లేకుంటే నియోజకవర్గంలో 118 జీఓ బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మదుసుధన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ చేసే మోసాలను ప్రజలు సహించరు : సామ రంగారెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ మోసాలను తెలంగాణ ప్రజలు ఇక సహించబోరని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామా రంగారెడ్డి పేర్కొన్నారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ సిండికేట్‌బ్యాంకుకాలనీ, వివేకానందనగర్, కోదండరాంనగర్, సీసాలబస్తి, తిరుమలనగర్‌లో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా అనేక ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు బాసటగా నిలిచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్రంలోని కెసిఆర్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతోందని ఆరోపించారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో వర్షాలు కురిస్తే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతాన్ని ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టడంలో మంత్రులు, ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని, సరూర్‌నగర్‌చెరువు సుందరీకరణ మాట దేవుడెరుగు చెరువును సెప్టిక్ ట్యాంక్‌లాగా చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో బిజెపికి అవకాశమిస్తే చెరువు సుందరీకరణ, ఎస్టిపి నిర్మాణం పూర్తిచేసి ముంపుకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్ష కార్యదర్శులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, రామ్‌రెడ్డి, లక్ష్మిప్రసాద్, కాసం రామ్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, వివేకానందరెడ్డి, సందీప్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయి ఆలయ రజోత్సవ వేడుకలు


బ్రోచర్ అవిష్కరిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ ధర్మపురికాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయం 25వ వసంతాల రజతోత్సవ వేడుకల బ్రోచర్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అవిష్కరించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు ఎం.మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధర్మపురికాలనీ ఆలయ సమీపంలో తాను నివాసం ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. డివిజన్ సమస్యలపై కార్పొరేటర్ గీత ప్రవీణ్ తన వంతు సేవలు అందిస్తున్నారని అభినందించారు. ఏడాది పొడవునా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, మహమూద్, సుందర్, ఆలయ కమిటి సభ్యులు వేణుగోపాల్, శ్రీనివాస్, పర్వేష్‌సింగ్, మాణిక్‌ప్రభు, భాస్కర్‌రెడ్డి, శర్మ, సురేందర్, రామరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పూజారిపై ఆలయ ఛైర్మన్ భర్త చేసిన దాడి అమానుషం : బ్రాహ్మణ సంఘాలు

**వనస్థలిపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం పంచారామ ఆలయంలో పని చేస్తున్న పూజారి మీద ఆలయ ఛైర్మన్ భర్త, వైసిపి నేత జరిపిన దాడి, యజ్ఞోపవీతం తెంపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వనస్థలిపురం గాయత్రి భవన్ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, పోచంపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ ఇతర సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయత్రిమాతకు ప్రతిరూపమైన యజ్ఞోపవీతాన్ని తెంపడం మహాపాపంతో సమానమని ఈ నీతి బాహ్యమైన చర్యకు ఉపక్రమించిన వైసిపి నాయకుడు యావత్ బ్రాహ్మణ్యానికి బాహటంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం దేవస్థాన ఛైర్మన్, ఆమె భర్త మీద సరైన క్రమ శిక్షణ చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు.

## మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : ఛైర్‌పర్సన్ అనితానాయక్

**మలక్‌పేట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరిస్తామని నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని జాంబాగ్, కిషన్‌గంజ్, బేగంబజార్, పూల మార్కెట్, ఉస్మాన్‌గంజ్ మార్కెట్ల ను అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్, అధికారులు, పాలక వర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర మార్కెట్లను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వ్యాపారస్తులు, రైతుల సమస్యలను తెలుసుకుని మెరుగైన ధరలను అందించే విధంగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ భూమేష్, డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానంద్, నరేష్, యాదగిరి, మాణిక్‌రావు, లలిత, అభిషేకం, సల్మాన్‌ఖాన్, రాముయాదవ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్‌లో పర్యటిస్తున్న ఛైర్‌పర్సన్ అనితానాయక్

## యుజిడి పనులకు శంకుస్థాపన : మైనంపల్లి


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి, కార్పొరేటర్ సునిత

**మల్కాజిగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లో రూ.28లక్షలతో యుజిడి పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ప్రజలు తనపై పెట్టకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతే కాకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసోరి సునీత, డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, సీనియర్ నాయకుడు మేకల రామూయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అనంతసరస్వతినగర్‌లో...** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ అనంతసరస్వతి నగర్‌లో రూ. 96లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సంపత్ రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు, ఎస్ఎన్‌డిపి పనుల పరిశీలన : మేయర్


ఎస్ఎన్‌డిపి పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 3వ డివిజన్ సాయి బాలాజీ టౌన్‌షిప్‌లో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను అదే విధంగా ఎస్ఎన్‌డిపి పనులను శుక్రవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. డివిజన్‌కు విచ్చేసిన ఆమె స్థానిక కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణారెడ్డితో కలిసి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇ జ్యోతి, ఎఇ వినీల్‌గౌడ్, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం దగా : కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి


స్థానికుల సమస్యలను అధికారులకు విన్నవిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గృహలక్ష్మి పథకం పేరుతో ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు సమస్యలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి గడువు ముగియడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో ప్రజలను మధ్య పెడుతుందని విమర్శించారు. నోటరీ స్థలాలకు పట్టాల కేటాయింపులో తీవ్రజాప్యం జరుగుతుందని, స్థానికులు ప్రభుత్వఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం కోసమే పెట్టారని విమర్శించారు. ఈ సందర్భంగా ఉప్పల్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాసులు, శానిటేషన్ డిఇ చందన, రెవెన్యూ అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, సాల్మన్‌బాబు, సాయిబాబా, గుజ్జుల రాజు, శ్రవణ్‌కుమార్, ప్రభాకర్, గ్యార కిరణ్; అమీర్, బన్నీ, పవన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి


డివిజన్ అధ్యక్షులకు సూచనలు చేస్తున్న సామ సుందర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బిఆర్ఎస్ అధ్యక్షులతో శుక్రవారం కేశవనగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్‌రెడ్డి మాట్లాడుతూ దళిత బంధు, గృహలక్ష్మి, బిసి బందు, మైనార్టీ బందు పథకాలను ప్రజల్లోకి తీసువెళ్లి అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్టు భాస్కర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రవీణ్‌రాజ్, శ్రీనివాస్, సాయిబాబ, అలీ మీర్జా, ఎజాజ్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌కు విశేష స్పందన : అమ్జదుల్లాఖాన్


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న అమ్జదుల్లాఖాన్

**మలక్‌పేట, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభిస్తుందని ఎంబిటి అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ పేర్కొన్నారు. చంచల్‌గూడలోని ఎంబిటి కార్యాలయంవద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, నిరుపేదల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. నగరంతోపాటు ఇతర ప్రాంతాలనుండి ప్రజలు ప్రజాదర్బార్ కార్యక్రమానికి విచ్చేసి తమ సమస్యలను మాకు తెలుపుతున్నారని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.